

"వదినా, లలితొదినా" అంటూ చొరవగా ఇంట్లోకి, తర్వాత వంటింట్లోకి వచ్చేసింది ఉష.

ఆమెని చూస్తూనే "రా ఉషా! ఏంటి ఇలా వచ్చావ్? ఏదైనా కూర కావాలా. కావాలంటే కొద్దిసేపు ఆగాలిమరి" చెప్పిందామె.

"అదేం లేదు వదినా. మావారు ఆఫీసుకెళ్ళి పోయారు. కేబుల్ టి.వి.లో బొమ్మలకు బదులు చుక్కలు వస్తున్నాయ్. ఏం తోచక ఇలా వచ్చాను" అంటూ లలిత వంట చేస్తున్న తీరు చూసి ఆశ్చర్యపోయిందామె.

మురికి మురికిగా ఉన్న చాకుతో, కళ్ళ

# కూర కాదు క్రూర

జోడు పెట్టుకోకుండా కాయ గూరల్ని అడ్డదిడ్డంగా పుచ్చులూ, చచ్చులూ అని చూడకుండా కోసేసి, మాట్లాడుతూనే నుదుటున చెమట తుడుచుకుని, అదే చేత్తో కూరగాయల్ని మూకుట్లో వేసింది. తర్వాత కొద్దిసేపటికి చెవిలో వేలు పెట్టుకు తిప్పుకుని, అదే వేళ్లతో ఉప్పు వేసి, అరె, సరిపోదేమో... అని తల గోక్కుని, అదే చేత్తో మరికొంచెం ఉప్పు వేసి, మళ్ళీ వేలు ముంచి చూడబోయి, సరిపోతుందిలే... అని విరమించుకుంది.

అలా ఆమె కూర చేసే విధానం చూసిన ఉషకి మతిపోయినంత పనైంది. ఎందుకంటే, రోజూ ఉష, లలితని అడిగి కూరలు తీసుకుంటూ ఉంటుంది.

ఈవేళ లలిత కూర చేసే విధానం ప్రత్యక్షంగా చూసి ఉలిక్కిపడింది. తర్వాత కొద్దిసేపటికి లలిత కొంచెం కూర ఇస్తానన్నా "వద్దు వదినా నేనూ ఇదే కూర చేసాను" అని చెప్పి పరుగులాంటి నడకతో అక్కడ్నుంచి వెళ్ళిపోయిందామె.

తర్వాత మరెప్పుడూ లలితని కూరలు అడగలేదు ఉష. తర్వాత ఆమె చక్కగా వంట చేయడం నేర్చుకుంది.

కొద్దిరోజుల తర్వాత ఏదో పని మీద తన దగ్గరకి వచ్చిన ఉషతో... "ఇదుగో ఉషా, నీకిష్టమైన గుత్తివంకాయ కూర చేశాను ఇవాళ. కొంచెం తీసుకెళ్లు" అంది.

ఉష ఆ కూర వైపు ఆశగా చూస్తూనే, దానిని లలిత ఎలా చేసి ఉంటుందో ఊహించుకుని, "వద్దు వదినా నేను కూడా..." అని చెప్పబోతూండగానే లలిత అందుకుని...

"నువ్వూ ఇదే కూర చేశానని చెప్తావ్. అంతేగా? అయినా ఈ కూర నేను, నువ్వు అప్పుడు చూసినంత క్రూరంగా చేయలేదులే" చెప్పిందామె నవ్వుతూ.

విషయం అర్థం కాని ఉష ఆశ్చర్యంగా చూస్తూ 'అది... అది...' అంటూ నసిగింది.

"నాకు తెల్సులే ఉషా. నేను ఆ రోజు ఆ కూర అలా క్రూరంగా చేయడానికి వెనక ఉన్న అసలు ఉద్దేశం... నువ్వు చక్కగా వంట నేర్చుకోవాలని, మీ ఆయనకి నువ్వే స్వయంగా వండి పెట్టాలనీ. కావాలనే నేను అలా చేసాను" వివరించింది ఆమె.

"థ్యాంక్స్ వదినా" చెప్పిందామె ఆనందంగా... లలిత ఇచ్చిన కూరని ప్రేమగా అందుకుంటూ. ●

**గంగాధర్ వడ్లమన్నాటి**